www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023 5 ఏలూరు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు వైద్యులు ఆర్ఎస్ఆర్కె.వరప్రసాదరావు ఆధ్వర్యంలో రక్తం మార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బిబి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి రోజున మానవత సంస్థ సభ్యులు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఏలూరులోని వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి ఉచిత భోజనం చేసిన ఏలూరు మానవత ఛైర్పర్సన్ అడుసుమిల్లి నిర్మల, యార్లగడ్డ కృష్ణమోహన్ దంపతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

అసైన్డ్ పెద్దల పరమే..!

- అసైన్డ్‌దారులకు ప్రతికూలంగా ప్రభుత్వ నిబంధనలు
- 20 ఏళ్లు పొజిషన్‌లో ఉంటే వారికే సొంతమట
- ఏలూరు జిల్లాలో 2003కు ముందు 62 వేల ఎకరాలు అసైన్డ్ భూముల పంపిణీ
- పేదలకిచ్చిన భూముల్లో 90 శాతం ప్రస్తుతం బడాబాబుల చేతుల్లోనే
- ప్రభుత్వ నిర్ణయంతో అసైన్డ్ భూములన్నీ పెద్దలకే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు తీరని అన్యాయం జరగనుంది. పాలకులు తీసుకున్న నిర్ణయంతో పేదలకు సెంటుభూమి కూడా లేకుండాపోనుంది. 2003కు ముందు వరకూ ఏలూరు జిల్లాలో 62 వేల ఎకరాల అసైన్డ్ భూములు పేదలకు పంపిణీ చేసినట్లు అధికారులు తేల్చారు. పంపిణీ చేసిన భూముల్లో 90 శాతం ఇప్పటికే బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. తమ భూములు తమకే ఇవ్వాలంటూ అనేక ప్రాంతాల్లో పేదలు పోరాటాలు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని దోసపాడులో 150 ఎకరాల అసైన్డ్‌భూమికి సంబంధించి అక్కడి దళితులు ఏళ్ల తరబడి పోరాడుతూనే ఉన్నారు. తమకు న్యాయం జరుగుతుందని వెయ్యి కళ్లతో వేచి చూస్తున్నారు. టి.నరసాపురం వంటి అనేక మండలాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదలకు పెనుశాపంగా మారింది. పేదలంతా తమ భూములను కోల్పోనున్నారు. అదే జరిగితే పేదల జీవితాల్లో పూర్తిగా చీకట్లు కమ్ముకోనున్నాయి. అసైన్డ్ భూముల్లో 20 ఏళ్లు పొజిషన్‌లో ఉన్నవారు మార్కెట్ ధరకు మూడు రెట్లు చెల్లిస్తే వారికే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పేదల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. స్థానిక అధికారుల సాయంతో 20 ఏళ్లు పొజిషన్‌లో ఉన్నట్లు చూపించి పేదలకిచ్చిన అసైన్డ్ భూములన్నీ పెద్దలు సొంతం చేసుకునే పరిస్థితి నెలకొంది. దీన్ని అసైన్డ్ భూములు పొందిన పేదలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం అసైన్డ్ భూమి వారసత్వంగా ఇవ్వాలే తప్ప అమ్మకాలు, విక్రయాలు చెల్లవు. అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పేదల నిస్సహాయతను అడ్డం పెట్టుకుని అప్పట్లో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను పెద్దలు తమ వశం చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఆ భూములన్నీ పేదలకు అప్పగించాల్సి ఉంది. ప్రభుత్వం మాత్రం అందుకు వ్యతిరేకంగా ముందుకు సాగుతోంది. పేదల ఆర్థిక పరిస్థితిలో మార్పు రావాలంటే భూమి అనివార్యమని ఎన్నో పోరాటాలు సాగాయి. వామపక్షాలతో సహా ప్రజాసంఘాల పోరాటాల ఫలితంగానే పేదలకు అప్పట్లో ప్రభుత్వాలు భూపంపిణీ చేశాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ పేదలకు భూమి అనేది లేకుండా పోయే పరిస్థితి ఏర్పడనుంది. భూమి మొత్తం కొద్దిమంది చేతుల్లోకే వెళ్లిపోనుంది. గతంలో పంపిణీ చేసిన వేలాది ఎకరాల భూములను బడాబాబులకు కట్టబెట్టి.. ఇప్పుడు ఏదో ఊతూతంత్రంగా భూపంపిణీ చేస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో ఇటీవల 752 మందికి 693.25 ఎకరాలకు సంబంధించి పట్టాలిచ్చే కార్యక్రమం చేపట్టారు. గతంలో పంపిణీ చేసిన భూములను బడాబాబులకు ధారాదత్తం చేయాలనుకోవడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం వేలాది మంది పేదలకు పెనుశాపంగా మారిన పరిస్థితి ఉంది. అసైన్డ్ భూములను అసలైన పేదలకు అప్పగించాలని అంతా కోరుతున్నారు. అప్పుడే పేదలకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

స్వీప్ ద్వారా అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి

అధికారులకు జిల్లా ఎన్నికల పర్యవేక్షకులు బి. శ్రీధర్ ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవచ్చునని వీలుంటుందని కలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ, జిల్లా ఎన్నికల పర్యవేక్షకులు బి.శ్రీధర్ అన్నారు. ఫొటో ఓటరు జాబితాల సంక్షిప్త సవరణ-2024కు సంబంధించి శ్రీధర్ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జిల్లాలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై సమీక్షించారు. తొలుత ఏలూరు జిల్లాలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ, స్వీప్ కార్యక్రమాలపై లావణ్యవేణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు తరచూ గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు గల ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఇందుకోసం స్వీప్ కార్యక్రమాలను నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత మనపై ఉందన్నారు. ఓటర్ల నమోదుకు ఇంకా సమయం ఉన్నందున ఈ విషయంపై ఎఇఆర్ఒలు, ప్రత్యేక ఎఇఆర్ఒలు దృష్టి సారించాలన్నారు.

వివిధ రాజకీయ పక్షాల నుంచి వచ్చిన ఫిర్యాదులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిఒ నిబంధనలు పాటించి పరిష్కరించాలన్నారు. ఏ చిన్న ఫిర్యాదు అందినా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సరైన విధంగా పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితాలపై క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణకు వచ్చేనెల తొమ్మిదో తేదీ వరకూ గడువు ఉందని, 26లోగా వాటిని పరిష్కరించాలని, 2024 జనవరి ఐదోతేదీ నాటికి తుది జాబితాలు ప్రకటించాలన్నారు. వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించి క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. జిల్లాలో ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్ఒలను నియమించామని, టిడిపి, వైసిపిలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకున్నాయని తెలిపారు. గతనెల 27వ తేదీన ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేసి సాఫ్ట్, హార్డ్ కాపీలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించామని చెప్పారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లు, 28 మండలాలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటరీ నియోజకవర్గం ఉన్నాయన్నారు. జిల్లా జనాభా 21,35,149 మంది కాగా ఓటర్ల జాబితాల సవరణ షెడ్యూల్ ప్రకారం గత నెల 27 నాటికి ముసాయిదా జాబితాలు ప్రకటించామని తెలిపారు. దీని ప్రకారం జిల్లాలో పురుష ఓటర్లు 7,78,884 మంది, మహిళా ఓటర్లు 8,09,615 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 123 కాగా మొత్తం 15,88,622 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సర్వీసు ఓటర్లు 688 మంది ఉన్నారని తెలిపారు. జనాభా ఓటర్ల నిష్పత్తి (ఇపి రేషియో) 744, జెండర్ రేషియో 1039 కాగా జిల్లాలో 1743 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్(బిఎస్‌పి), నెరుసు నెలరాజు(బిజెపి), ఎ.రవి(సిపిఎం), రాజనాల రామ్మోహన్‌రావు(కాంగ్రెస్), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైఎస్ఆర్‌సిపి) జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తమ సంతృప్తివ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఇఆర్ఒలు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, ఆర్‌డిఒ ఖాజావలి, కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, పోలవరం ప్రాజెక్ట్ ఆర్ఎంసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటి నూతన డైరెక్టర్‌గా ఆచార్య ఎ.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం చంద్రశేఖర్‌ను డైరెక్టర్‌గా నియమించింది. వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీస్ వ్యవస్థ ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తుందని సిబ్బంది విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి అన్నారు. ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో సిఐలు, ఎస్ఐలు ఈ కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. మహిళలపై నేరాలను నిరోధించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచించారు. బాలికల మిస్సింగ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఆచూకీ తెలుసుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన నిందితులకు సత్వరం శిక్ష పడేలా పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా సంఘటనా స్థలాన్ని పరిశీలించడం, సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జీషీటు దాఖలు, కోర్టులోసాక్షులను ప్రవేశపెట్టడంలో పోలీస్ సిబ్బంది తమ ప్రతిభను చాటుకోవాలని చెప్పారు. సివిల్ కేసుల్లో పోలీసులు చట్టం మేరకు మాత్రమే తమ పాత్ర పోషించాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచడంతో పాటువారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు అవగాహన కల్పించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సానుకూలంగా విని చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలన్నారు. పోలీస్ సిబ్బంది అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్ఇబి ఆధ్వర్యంలో జిల్లాలోని నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలని చెప్పారు. మద్యం అక్రమ రవాణా, సారా విక్రయాలు, ప్రభుత్వం నిషేధించిన ఖైనీ, గుట్కాల విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో డిసిఆర్‌బి సిఐ ఎం.సుబ్బారావు, దుర్గాప్రసాద్, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజయుడు ఉన్నారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు సముదాయ సమావేశం గురువారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు 60 మంది పాల్గొని శిక్షణ పొందారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి-2 బి.రాములు పాల్గొని ఉపాధ్యాయులకు సమ్మెటివ్ పరీక్షల నిర్వహణపై సూచనలు అందించారు. సబ్జెక్టు సముదాయ చైర్‌పర్సన్ స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోవకుమారి ఉపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలను గురించి, విద్యార్థులకు బోధించే విధానంపై పలుసూచనలు చేశారు. రిసోర్స్‌పర్సన్‌గా బుట్టాయగూడెం ఉన్నత పాఠశాల జువాలజీ ఉపాధ్యాయులు జి.గంగాధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిసెంబర్ నెలకు సంబంధించిన పాఠ్యాంశాలపైన బోధనోపకరణాలను తయారు చేశారు. పదో తరగతి పరీక్షల గురించి ప్రణాళిక తయారు చేశారు.



మాట్లాడుతున్న ఎంఇఒ

రైతులకు భారంగా 'జలకళ'..!

పథకం అమలు తీరుపై రైతులు అసంతృప్తి - సుమారు రూ.3 లక్షల భారం పడుతోందని ఆవేదన

ప్రజాశక్తి - భీమడోలు

అంబరుపేటలో జలకళ బోరుకు 10 హెచ్‌పి మోటార్ బిగించినా తక్కువగా వస్తున్న నీరు

మెట్ట ప్రాంత రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జలకళ పథకం అమలు తీరు పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. ఉన్నతాధికారులు స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కాగితాలపై లెక్కలు కట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. 2021లో పథకం ప్రవేశపెట్టినప్పుడు ప్రకటించిన రాయితీలు, ఉచిత బోరు సౌకర్యం నిబంధనలు 2023లో అమల్లోకి వచ్చే సమయానికి మారిపోయాయని రైతులు అంటున్నారు. దీనివల్ల ఒక్కోబోరు ఏర్పాటుకు సుమారు రూ.మూడు లక్షల వరకూ అదనంగా ఖర్చవుతుందని రైతుల పేర్కొంటున్నారు. మండలంలోని మెట్టప్రాంత గ్రామాలైన సూరప్పగూడెం, పొలసానిపల్లి, పాక్షికంగా భీమడోలుతో పాటు అంబర్‌పేట, దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామాల్లో పథకం అమలు కోసం 2021లో 115 దరఖాస్తులు వచ్చాయి. వాటికి అనుమతులు లభించినట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా బోర్ వేయడం, కేసింగ్ పైపులు అమర్చడం, విద్యుత్ సౌకర్యం కల్పన, విద్యుత్ పరికరాల ఏర్పాటు, విద్యుత్ మోటారు బోరు సమకూర్చడం వంటి అంశాలున్నాయి. దీనికోసం యూనిట్‌కు రూ.ఎనిమిది లక్షల వరకూ మంజూరు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ 2023 నాటికి యూనిట్ ధర పెరిగిందంటూ విద్యుత్ కనెక్షన్ తీసుకునే భారాన్ని అధికారులు రైతులపై వేశారు. దీనికోసం రైతులు అదనపు విద్యుత్ స్తంభాలు వేసుకోవడం, కండక్టర్ల ఖర్చు భరించటం వంటి బాధ్యతను తీసుకున్నారు. ఇదే క్రమంలో విద్యుత్ అధికారుల అనుమతుల కోసం సుమారు రూ.రెండు లక్షల వరకూ రైతులు సొంతంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. కనీసంగా రెండున్నర ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులను వ్యవసాయపరంగా ఆదుకునేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు కార్యక్రమం ప్రారంభించే సమయంలో అధికారులు ప్రకటించారు. ఇదే క్రమంలో జియాలజిస్ట్ సిఫార్సు మేరకు బోర్ వేసే స్థలాన్ని ఎంపిక చేస్తారు. ఏడు అంగుళాల విస్తీర్ణం గల బోరు గొయ్యి 400 అడుగుల వరకు వేసి, దానిలో ఆరు అంగుళాల విస్తీర్ణం గల కేసింగ్ పైపులను 40 వరకూ అమర్చాల్సి ఉంది. దీనికోసం రూ.నాలుగు లక్షల వరకూ ఖర్చవుతుందని అధికారులు అంచనాలు కట్టారు. పనులు చేసేందుకు గుత్తేదారులను ఏర్పాటు చేశారు. ఆ తరువాత విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు తమ ప్రయత్నాలు చేసుకోవాలి. ఆపై భూగర్భ జలాల లభ్యత 200 అడుగులు ఉంటే 7.50 హెచ్‌పి సామర్థ్యం గల మోటారు, 300 అడుగులు ఉంటే 10హెచ్‌పి సామర్థ్యం గల మోటార్లను సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు 25 మోటార్ల కోసం ఉపాధి హామీ అధికారులు ప్రతిపాదించగా 15 మోటార్లకు అనుమతులు లభించాయి. వీటిలో తొలి దశలో ఆరు మాత్రమే వచ్చాయి. వీటిని అంబరుపేట, సూరప్పగూడెం, భీమడోలు గ్రామాలకు రెండేసి వంతన కేటాయించారు. ఎట్టకేలకు అంబరుపేటలో 10 హెచ్‌పి సామర్థ్యం గల మోటార్లను బిగించారు. దీన్ని పక్కనపెడితే ఆ ప్రాంత రైతులు బోరు వేసి ఏడాది దాటినప్పటికీ అధికారులు మోటార్లను సరఫరా చేస్తారన్న నమ్మకం లేక వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు సుమారు 300 నుంచి 400 అడుగుల లోతు గల భూగర్భ జలాలను బయటకు తీసేందుకు రూ.రెండు లక్షల నుంచి రూ.రెండున్నర లక్షల వ్యయంతో 20 నుంచి 30 హెచ్‌పి సామర్థ్యం గల మోటార్లను బిగించి రైతులు గత ఆరు నెలల కాలంగా వ్యవసాయం చేస్తున్నారు. దీని నుంచి మూడు అంగుళాల బోరు నీరు అడుగు దూరంపైబడి వెదజల్లితో నీటిని సరఫరా చేస్తుంది. దీంతో రైతులు సజావుగా సాగు చేస్తారు.

తాజాగా 10హెచ్‌పి సామర్థ్యం గల బోరు మోటారును ప్రభుత్వం అందజేసిన నేపథ్యంలో దాన్ని అప్పటికే పనిచేస్తున్న బోరు మోటారును తొలగించి దాని స్థానంలో బిగించారు. 10హెచ్‌పి సామర్థ్యం గల ఒక్కొక్క బోరు మోటారుకు రూ.1.56 లక్షల వంతున అధికారులు లెక్క కట్టారు. దీని ద్వారా బోరు నుంచి రెండు అంగుళాల విస్తీర్ణంతో కేవలం ఆరు అంగుళాల దూరం మాత్రమే నీటిని అందిస్తుంది. ప్రస్తుతం భూగర్భ జలాలు బాగున్న సమయంలో ఈ విధంగా ఉంటే రానున్న కాలంలో ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మోటార్లను ఇటీవల ఏర్పాటు చేశారు. దీంతో రైతుల స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తమకు ఎక్కువ సామర్థ్యం గల మోటార్లను సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయాలపై ఉపాధి హామీ అధికారులను వివరణ కోరగా రైతుల విజ్ఞప్తులను ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్, ఇతర అధికారులు

సిఎం జగన్‌చే వర్చువల్‌గా

మొక్కజొన్న స్టార్చ్ ఉత్పత్తి యూనిట్‌కు శంకుస్థాపన

రూ.144 కోట్లతో 32.94 ఎకరాల్లో కొమ్మూరులో నిర్మాణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో రూ.144 కోట్లతో 32.94 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మొక్కజొన్న నుండి స్టార్చ్ ఉత్పత్తి యూనిట్‌కు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో సిఎం జగన్ బుధవారం శంఖుస్థాపన చేశారు. కొమ్మూరులో ఏర్పాటు చేయస్తున్న శ్రీవెంకటేశ్వర బయోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ గ్రౌండ్ బ్రేకింగ్‌ను వర్చువల్‌గా సిఎం ప్రాంభించారు. అనంతరం ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్య వేణి స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కజొన్న నుండి స్టార్చ్, ఇతర ఉత్పత్తుల తయారీకి ప్రతిపాదనలు పెట్టామన్నారు. ఒకసారి ప్రారంభించిన తరువాత ఈ యూనిట్ రోజుకు 300 టన్నుల మొక్కజొన్నను ప్రాసెస్ చేయగలదన్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 210 మందికి పరోక్షంగా 100 మందికి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయోటెక్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కాశీవిశ్వనాధం, ఎపిఎఫ్‌పిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, సిపిఒ శ్రీనివాస్, ఇండస్ట్రీస్, డిస్ట్రిక్ట్ రిసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

1న ద్వారకాతిరుమలలో 'జగనన్నకు చెబుదాం'

ఏలూరు: ప్రతి బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా ద్వారకాతిరుమల మండలంలో వచ్చేనెల ఒకటో తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ద్వారకాతిరుమల శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఉదయం పది గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను తెలియజేయొచ్చని లావణ్యవేణి తెలిపారు.

డిటిడిసి కొరియర్‌కు ఝలక్

సేవా లోపం వల్ల వినియోగదారుడికి రూ.50 వేలు పరిహారమివ్వాలని కమిషన్ ఆదేశం

ఏలూరు: ప్రముఖ కొరియర్ సంస్థ డిటిడిసికి వినియోగదారుల కమిషన్ ఝలక్ ఇచ్చింది. సకాలంలో కొరియర్ బట్వాడా చేయని కారణంగా ప్రతిష్టాత్మకమైన నల్సార్ యూనివర్సిటీలో ప్రవేశం కోల్పోయిన వ్యక్తికి సేవాలోపం చేసిన డిటిడిసి రూ.50 వేల పరిహారం, మరో రూ.5 వేలు ఖర్చుల కింద చెల్లించాలని బెంగళూరులోని సంస్థ ప్రధాన కార్యాలయానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేసు పూర్వాపరాలు విచారించిన కమిషన్ అధ్యక్షులు డి.కోదండరామ్మూర్తి, సభ్యులు ఎస్.సురేష్‌కుమార్, కెవిఎన్.లక్ష్మి ఈ మేరకు తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురానికి చెందిన కొప్పర్తి భాస్కరనారాయణ కుమారుడు కొప్పర్తి కృష్ణ శ్రీనివాస్ హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో బిఎ, ఎల్ఎల్‌బి, ప్రవేశపరీక్షలో 96.6 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. అనంతరం ఆ యూనివర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తును నరసాపురంలో డిటిడిసి, కొరియర్ ద్వారా 2021 ఆగస్టు మూడో తేదీన హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీకి పంపించారు. దరఖాస్తు గడువు 2021 ఆగస్టు ఐదో తేదీ ముగిసిన తరువాత, ఆరో తేదీ సాయంత్రం 7.35 గంటలకు ఆ దరఖాస్తును కొరియర్ సంస్థ వారు నల్సార్ యూనివర్సిటీకి అందజేశారు. యూనివర్సిటీలో ప్రవేశానికి 93.8 శాతం నుండి 98.6 శాతం వరకూ మార్కులు సాధించిన వారిని ఎంపిక చేశారు. కొరియర్ సంస్థ సేవాలోపం కారణంగా 96.6 శాతంతో ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన ఆయన సకాలంలో దరఖాస్తు యూనివర్సిటీకి చేరని కారణంగా తాను ప్రతిష్టాత్మకమైన నల్సార్ యూనివర్సిటీలో ప్రవేశ అవకాశాన్ని కోల్పోయానని, అందుకు కొరియర్ సంస్థ సేవాలోపమే కారణమని, తనకు జరిగిన నష్టానికి, మానసిక క్షోభకు నష్టపరిహారం ఇప్పించాలని ఉమ్మడి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను కృష్ణశ్రీనివాస్ ఆశ్రయించారు. ఇరు వాదనలు విన్న కమిషన్, విచారణ చేపట్టి కొరియర్ సంస్థ సేవాలోపంగా గుర్తించి రూ.50 వేలు పరిహారం, మరో రూ.ఐదు వేలు ఖర్చులకు చెల్లించాలని, ఈ మొత్తం నాలుగు వారాల్లో అందించాలని కమిషన్ ఆదేశించింది.

చెత్త శుద్ధి వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

వాహనాలను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

పరిసరాల్లోని మురుగునీరు, చెత్త తొలగింపునకు మురుగుశుద్ధి చేసే వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛత ఉద్యమ యోజన కింద ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి ఆర్థిక సహాయంతో రాష్ట్ర షెడ్యూల్డు కులాల ఆర్థిక సంస్థ వారు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు రూ.మూడు వేల లీటర్ల సామర్థ్యం గల డిసడ్లింగ్ మురుగుశుద్ధి వాహనాలను అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం మురుగునీరు, చెత్త నిర్మూలనా వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వాహనం విలువ రూ.31.67 లక్షలు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15.06 లక్షలు, ఎన్ఎస్‌కెఎఫ్ డిసి రుణం కింద రూ.16.61 లక్షలు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.కుముదినిసింగ్, మేతర అజయ్‌బాబు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

మరిన్ని ఉద్యోగాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించడం ఎంఎస్ఎంఇ సర్వే ప్రధాన ఉద్దేశమని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ సమావేశపు హాలులో బుధవారం సూక్ష్మ, మధ్యతరహా పారిశ్రామికవేత్తల (ఎంఎస్ఎంఇ) ట్రాకింగ్ సర్వేపై ఏలూరు డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అదే సమయంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను మరింత మెరుగుపరిచేందుకు, ఆయా పరిశ్రమల్లో ఏ విభాగంలో మానవ వనరులు అవసరమో తెలుసుకుని, నిరుద్యోగ యువతకు ఆయా రంగాల్లో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇందుకోసం గ్రామ/వార్డ్ సచివాలయాల పరిధిలోని సిబ్బంది తమ సచివాలయ పరిధిలో ఉన్న పరిశ్రమల వివరాలు, అవి ఉత్పత్తి చేసే ఉత్పత్తులు, ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఇంకా ఎంతమందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నది, ఏ రంగంలో శిక్షణ పొందిన ఉద్యోగులు అవసరం, తదితర వివరాలతో సర్వే జరుగుతుందన్నారు.

ఈ సర్వే వచ్చేనెల పదో తేదీ నుండి 20వ తేదీ వరకూ జరుగుతుందని, సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. శిక్షణలో సర్వేకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన పొంది, ప్రభుత్వం రూపొందించిన విధానంలో సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జీ, ఏలూరు డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసిపి నేత చెంచు రామారావుకు పితృ వియోగం

ప్రజాశక్తి - కలిదిండి

వైసిపి నియోజకవర్గ నాయకులు పోసిన చెంచు రామారావుకు పితృవియోగం కలిగింది. పోసిన చెంచు రామారావు తండ్రి పోసిన బ్రహ్మయ్య శాస్త్రులు(90) అనారోగ్యానికి బుధవారం గురై మరణించారు. ఆయన స్వగ్రామం మండలంలోని గుర్వాయిపాలెం కాగా గత కొన్ని ఏళ్ళుగా కలిదిండిలో స్థిరపడ్డారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవారు. ఆయన భార్య గత ఎనిమిదేళ్ల క్రితం అస్వస్థకు గురై మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా ఇటీవలే చిన్న కుమారుడు ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చిన్ననాటి నుంచి కమ్యూనిస్ట్ నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ఆ భావాలతో గ్రామ అభివృద్ధిలో, యువత క్రీడల పట్ల మక్కువ చూపడంలో శ్రద్ధ చూపేవారు. కలిదిండిలో ఆయన స్వగృహం వద్ద బ్రహ్మయ్య శాస్త్రులు భౌతిక కాయాన్ని పలువురు గ్రామ ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మీడియాకు అన్ని విధాలా సహకరిస్తా : ఎంఎల్‌సి

ఏలూరు: పాత్రికేయులంటే తనకు ప్రత్యేక అభిమానమని, మీడియాకు అన్ని విధాలా సహకారాన్ని అందిస్తానని ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ అన్నారు. బుధవారం కైకలూరులోని పలువురు ముఖ్య నేతలను ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు కలిసి డిసెంబర్ 3వ తేదీన ఏలూరులో జరగనున్న ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహాసభ ఆహ్వానాలు అందజేశారు. ఎంఎల్‌సిని వారి ఇంటి వద్ద కలిసి మహాసభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధి మీడియా అని వైసిపి ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హత జలిగిన జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలం, ఇతర సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుకు కూడా మహాసభ ఆహ్వానాన్ని పిఎ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు కెఎస్.శంకర రావు, ఎస్‌డి.జబీర్, ఎన్.గోపాలకృష్ణ, కె.సోమశేకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

జీలుగుమిల్లి: మండలంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.గంగాధర్ తెలిపారు. బుధవారం మండలంలోని జీలుగుమిల్లి సొసైటీలో ఒకటి, ములగలంపల్లి రైతు భరోసా కేంద్రంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలంటే తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. వరి కామన్ రకం రూ.1,637 గాను ఎ రకం గ్రేడ్ రూ.1,652గా నిర్ణయించినట్లు తెలిపారు. గోనె సంచులు కూడా అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలవరం: పోలవరం మండల కేంద్రంలోని స్థానిక సచివాలయ ఆవరణలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, మండల వైసిపి కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫాతిమా ముస్సీసా, దక్షి రాంబాబు, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, సొసైటీ ప్రెసిడెంట్ బలిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

నాణ్యమైన పనులు చేయించాలి

చింతలపూడి: అంగన్‌వాడీ సెంటర్ల అవసరాల గురించి నాడు-నేడు ద్వారా నాణ్యమైన పనులు చేయించాలని ఐసిడిఎస్ పిడి పద్మావతి తెలిపారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నాడు-నేడు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చింతలపూడి ఐసిడిఎస్ అంగన్‌వాడీ ప్రాజెక్ట్ పరిధిలో డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, పెయింటింగ్ వంటివి నాడు-నేడు అభివృద్ధిలో భాగంగా 67 సెంటర్లు నాడు-నేడుకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలరోజుల్లో పనులు పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఏడుగురు కూడిన కమిటీ ఉంటుందని, అందరూ చర్చించి, సెంటర్ల విద్యార్థులకు ఏది అవసరమో వాటిని గుర్తించి, పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కిరణ్ బాబు, అంగన్ వాడీ సూపర్ వైజర్స్, అంగన్ వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగించుకోవాలని ఆగిరిపల్లి మండల తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు కోరారు. మండల పరిధిలోని ఎన్నార్ కళాశాలలో ఎస్‌వీఈఈపి కార్యక్రమంలో భాగంగా వెలుగమ్మ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నార్ కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, ఉపాధికల్పనాధికారి డాక్టర్ ఎన్.సురేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, కె.రాగసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ సిఇఒ, ఏలూరు నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి సుబ్బారావు, ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలం రాజవరంలో బుధవారం టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సాధికార రాష్ట్ర సభ్యులు సుభాని షేక్, ఆదేపల్లి నరేష్ పాల్గొన్నారు.

ముసునూరు: నాలుగేళ్లలో జగన్‌రెడ్డి దళితులకు చేసిన న్యాయం కంటే అన్యాయమే ఎక్కువ అని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన ప్రభుత్వ ప్రచార ఆర్భాటాలకు ఖర్చుపెట్టిన నిధులను కూడా దళితుల కోసం ఖర్చు పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రాజబాబు, సర్పంచి గద్దల సుహాసిని మోహన్ రావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని అల్లూరులో బుధవారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బికెఎస్ నాని, బొమ్మినంపాడు సర్పంచి సుధా పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాల ఏర్పాటుపై గ్రామసభ

ముదినేపల్లి: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగనున్న షష్టి ఏర్పాట్లపై బుధవారం బెండర్ల గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి నేల సంధ్య పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గ్రామసభలు

ముదినేపల్లి: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని అల్లూరు, బొమ్మినం పాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపిడిఒ పి.మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈసభల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ సభలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొటప్రోలు కృష్ణ పాల్గొన్నారు.

రెండు కాసుల ఉంగరం అపహరణ

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో ఈనెల 27న మధ్యాహ్నం జ్యూయలరీ దుకాణంలో బంగారం కొనడానికి వచ్చిన షాప్ యజమానిని పక్కదారి పట్టించి రెండుకాసుల బంగారపు ఉంగరం దొంగలించిన సంఘటన నెలకొంది. దుకాణదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆకివీడు మండలం, ఐ.భీమవరం చెందిన గొర్లె సత్యనారాయణ అను వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి రూ.60 వేల విలువ చేసే రెండుకాసుల ఉంగరాన్ని స్వాధీనం చేసుకొని, అతనిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు పేదలు పండించుకుంటున్న భూములకు శాశ్వత భూహక్కు పత్రం అందచేస్తున్నట్లు నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద తహశీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 16 గ్రామాల్లో 248 మంది రైతులకు భూ హక్కు శాశ్వత పత్రాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కోండా దుర్గాభవానీ వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరులో భూహక్కు పత్రాలు అందచేస్తున్న ఎంఎల్ఎ

భీమడోలు: అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి యజమానులకు, వారి వారసులకు పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలానికి చెందిన 38 మంది, ఉంగుటూరు మండలానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానీ రంగా, ఎంపిపిలు కనమాల రామయ్య, జి.శ్రీలక్ష్మి హాజరయ్యారు.

టి.నరసాపురం : అసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేసి పేదలకు భూహక్కు కల్పించడం గొప్ప వరమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని ఎపిగుంట సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యక్రమంలో అసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాట్రాయి: జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు శాశ్వత పట్టా ఇచ్చి నిరుపేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తూ రాష్ట్రంలో ఉన్న నిరుపేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. చాట్రాయి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, జెడ్‌పిటిసి సభ్యురాలు చెలికాని అనూష, సర్పంచి దామెర ఉష పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జెడ్‌పి స్కూల్ విద్యార్థిని ఎంపిక

నూజివీడు రూరల్: పట్టణంలోని జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని బి.ప్రభ దీపిక బాస్కెట్ బాల్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ, కోచ్ వాకా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రం లూధియానాలో జరిగే సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ప్రభ దీపిక వెళుతున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, పిడిలు రాణి, సరళ అభినందించారు.

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ఏలూరు అర్బన్: తమకు రావాల్సిన మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది బుధవారం ఎపి మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కృష్ణచైతన్య, జాయింట్ సెక్రెటరీ దత్తాత్రేయ మాట్లాడుతూ మూడు నెలల నుంచి సిబ్బందికి జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నారని, వడ్డీలకు అప్పులు తెచ్చి పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విజయ్, రాజు, కరీమ పాల్గొన్నారు.

100 రోజులకు 'జనం కోసం జనసేన'

జీలుగుమిల్లి: జనం కోసం జనసేన 100వ రోజు కార్యక్రమం బుధవారం జీలుగుమిల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు హాజరై ప్రతి గడపకూ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగుమిల్లిలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పాలచర్ల వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారైందన్నారు. రాబోవు రోజుల్లో జనసేన తరపున అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రతి ఓటు పరిశీలన

నూజివీడు రూరల్: క్షేత్రస్థాయిలో ప్రతి ఓటును బూత్ లెవెల్ అధికారులు పరిశీలిస్తారని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఆయన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తికి అనేక ఓట్లు, మృతి చెందటం, ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోవడం వంటి సమాచారం ఉంటే అధికారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

8న అంగన్‌వాడీల సమ్మె విజయవంతం చేయాలి

పోలవరం: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి జరిగే సమ్మెకు ప్రజలందరూ మద్దతు నివ్వాలని జయప్రద చేయాలని సిఐటియు పోలవరం మండల కార్యదర్శి పివిఎస్.కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్‌వాడీ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పద్మావతి, సిహెచ్.మణి, సత్యవేణి, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ సమస్య పరిష్కారానికి చర్యలు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్లో ఆర్వో ప్లాంట్(తాగునీరు) సమస్య పరిష్కారానికి పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు చర్యలు చేపట్టారు. స్థానిక బొర్రంపాలెం హైస్కూల్లో నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్(ఆర్వో) మంజూరు కావడంతో అధికారులు ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ ప్లాంట్‌కు త్రీఫేస్ కరెంట్ లేక రెండు సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉందని మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎకు బొర్రంపాలెంకు చెందిన యువకులు సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన విద్యుత్ డిఇతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారని గ్రామానికి చెందిన యువకుడు కె.విజయ్ తెలిపారు.

పెనుమల్లిలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెనుమల్లి గ్రామ సచివాలయ పరిధిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి లేని పాలన సిఎం జగన్ అందిస్తున్నారని పార్టీ నాయకులు గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు పాల్గొన్నారు.

నారాయణపురంలో కరాటే పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో అంతర కళాశాలల మహిళ, పురుషులకు వేర్వేరుగా కరాటే పోటీలు బుధవారం నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. విశ్వవిద్యాలయం పరిధిలో వివిధ కళాశాలల నుంచి 13 జట్లు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ టికె విశ్వేశ్వరరావు వెల్లడించారు. పోటీలను కళాశాల సిపిడిసి కార్యదర్శి కూనపరాజు సీతారామాంజనేయరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పోటీల పరిశీలకులుగా సయ్యద్ సుభాని, డిఎన్.నారాయణ, ఇబ్రహీంబేగ్‌లు వ్యవహరించారు. ఈపోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు, మెడల్స్ విశ్రాంత పిడి ఆదిరెడ్డి సత్యనారాయణ చేతుల మీదగా అందజేశారు. ఇక్కడ గెలుపొందిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం జట్లు ఆల్ ఇండియా లెవెల్‌లో జనవరిలో భోపాల్‌లో జరిగే భారత విశ్వ విద్యాలయాల క్రీడా పోటీల్లో కరాటే విభాగం తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. పోటీల్లో 21 మంది పురుషులు, 18 మంది మహిళలు వేర్వేరు కళాశాలల నుంచి ప్రాతినిధ్యం వహించి తమ ప్రతిభను చూపారు. పురుషుల విభాగంలో.. పి.పవన్‌కుమార్, ఎల్.ప్రవీణ్‌కుమార్, కెఎల్.రామకృష్ణ, సిహెచ్.సత్యవంశీ, సిహెచ్.చరణ్‌మణికంఠ, పి.విజయ్, బి.ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగంలో.. ఎల్.శరణ్య(భీమవరం), కె.మహాలక్ష్మి(భీమవరం), ఎం.ప్రీతిశ్రీజ(ఏలూరు), ఎం.మాధురి (కాకినాడ), పి.శ్రీవిద్య(రాజమహేంద్రవరం), బిఎల్ఎన్.లహరి(రాజమహేంద్రవరం) ఎంపిక అయ్యారని ఆర్గనైజింగ్ కార్యదర్శి, కళాశాల పిడి రాజామారిసన్ వివరించారు.

రోడ్డు వేయాలని ఐటిడిఎ పిఒకు వినతి

బుట్టాయగూడెం: గిరిజన దర్బార్ సందర్భంగా వేరుమద్దిగూడెం గ్రామ యువకులు కెఆర్ పురం ఐటిడిఎ పిఒ ఎమ్.సూర్యతేజను కలిసి వేరుమద్దిగూడెం గ్రామానికి రోడ్డు మార్గం పూర్తిగా పాడైపోయిందని ప్రమాదకరంగా మారిందని వినతిని సమర్పించారు. గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న కొండవాగు వర్షాకాలం వస్తే ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. వర్షం తగ్గిన వారం పది రోజుల వరకు కొండవాగు దాటనివ్వదని, వారం పది రోజుల వరకు గ్రామస్తులు బయటికి వెళ్లడానికి వీలుపడదని, పూర్వకాలం నుంచి ఈ కొండవాగు ప్రవాహం వల్ల వర్షాకాలం వస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఏరుమద్ది గూడెం గ్రామానికి రోడ్డు సరిగా లేక అంబులెన్స్ గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదని, వర్షాకాలం వస్తే బడికి వెళ్లి చదువుకునే పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొరమామిడి నుంచి వేరు మద్ది గూడెం గ్రామానికి పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గోగుల చిన్నారెడ్డి రాంబాబు, లక్ష్మణ్, గోగుల రామకృష్ణారెడ్డి, సీతన్న చిన్నారెడ్డి, గోగుల బాబురావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల రాజీ

చింతలపూడి: జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంక్, రాజీపడు క్రిమినల్ కేసులు, సివిల్, కుటుంబ తగాదా, మనోవర్తి, గృహ హింస, చెక్‌బౌన్స్, ప్రోనోట్, ఎక్సైజ్, ప్రీ లిటిగేషన్ కేసులుగా బ్యాంక్ బకాయి కేసులు, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సి.మధుబాబు అన్నారు. రాజీ చేసుకోవడం వల్ల విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని తెలిపారు. కోర్టు నుంచి వచ్చిన వివరాల ప్రకారం డిసెంబర్ 9న చింతలపూడి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్ కేసులలో కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకోవచ్చని, అలాగే ప్రతిరోజు కోర్టులో జరుగు ప్రీ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు పోలీస్ వారిని, న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని కేసుల రాజీ కోసం సంప్రదించాలని తెలిపారు.

ఆర్‌టిసి పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్ఆర్‌టిసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసినా, ఆర్‌టిసి సంస్థలో కీలకమైన ఆర్‌టిసి లైసెన్సెడ్ పోర్టర్స్ సమస్యలు ఇంకా అలానే ఉన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ విమర్శించారు. ఆర్‌టిసి లైసెన్సెడ్ పోర్టర్స్ యూనియన్ ఏలూరు శాఖ సమావేశం బుధవారం ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి లైసెన్సెడ్ పోర్టర్స్‌ను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, పని భద్రత కల్పించాలని, ఆర్‌టిసి లైసెన్సెడ్ పోర్టర్స్‌కు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, రిటైర్ అయిన ఆర్‌టిసి లైసెన్సుడ్ పోర్టర్స్‌కు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైసెన్సెడ్ పోర్టర్స్ తమ్మిసెట్టి రమణయ్య పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో అవకతవకలపై వినతి

ఏలూరు అర్బన్: టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో జిల్లాలో ఓటర్ జాబితాలో టిడిపి గుర్తించిన అవకతవకలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో అనేక అవకతవకలు ఉన్నాయని, చనిపోయిన వారి ఓట్లు, ఒక్కరి ఓటు అనేకసార్లు జాబితాలో రావటం జరిగిందని తెలిపారు. అధికారులు వీటిపై విచారణ జరిపి కొత్త జాబితా సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘంటా మురళీ పాల్గొన్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్

ద్వారకాతిరుమల: ప్రాథమిక పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈనెల 29, 30 తేదీల్లో జరుగుతాయని మండల విద్యాశాఖాధికారి జె.సురేష్ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి ఈనెల 30న మిగిలిన 50 శాతం మంది హాజరవ్వాలన్నారు. 29న కొన్ని సబ్జెక్టుల సమావేశాలు జరిగాయని, బుధవారం కొన్ని జరుగుతాయని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు మ్యాజిక్ షో

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ప్రయోగాల పట్ల ఆసక్తిని, విజ్ఞానాభివృద్ధిని పెంచడానికి సైన్సు మ్యాజిక్ శిక్షణా శిబిరం ఉపయోగపడుతుందని జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.దేవేంద్ర తెలిపారు. హేలాపురి బాలోత్సవ కమిటీ, జన విజ్ఞాన వేదిక సమన్వయంతో ఏలూరులో ఎఆర్‌డిజికె హైస్కూల్, శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, సుబ్బమ్మదేవి హైస్కూల్, సిద్దార్థ వట్లూరు క్యాంపస్, సిద్దార్థ సత్రంపాడు స్కూల్, ప్రభుత్వ పాఠశాల కోటదిబ్బలలో మ్యాజిక్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆహ్వాన కమిటీ కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాసరావు ఆహ్వానం పలుకగా డైరెక్టర్ కె.చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. టీచర్స్ ప్రభాకర్, దుర్గారావు, శివకుమారి, నాగమణి పాల్గొన్నారు. సుబ్బమ్మదేవి హైస్కూల్‌లో నిర్వహించిన మ్యాజిక్ శిక్షణా కార్యక్రమంలో హెచ్‌ఎం పి.కుటుంబరావు మాట్లాడుతూ డిసెంబర్ 16, 17 తేదీల్లో జరిగే హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాల్లో సీనియర్స్ కేటగిరిలో ఇద్దరు పాల్గొనే అవకాశం ఉంది కాబట్టి సైన్సుతో కూడిన మ్యాజిక్ అవగాహన చేసుకోవాలన్నారు. వట్లూరులోని సిద్దార్థ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీమ మహంతి, మాస్టర్స్ జీమన్, శ్రీయ సత్యారావులు పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు దేవేంద్ర సమాధానాలు ఇచ్చారు. గవర్నమెంట్ హైస్కూల్ కోటదిబ్బలో జరిగిన శిక్షణలో హెడ్‌మాస్టర్ జివి.శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ మీద విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ బాలోత్సవంలో మ్యాజిక్ చేసే విధంగా శిక్షణ ఇస్తున్న బాలోత్సవ కమిటీని, జనవిజ్ఞాన వేదికను అభినందించారు. బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షురాలు జి.శారద మాట్లాడుతూ అవకాశం కల్పించిన హెడ్ మాస్టర్‌లకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ, ఎక్కువ మంది 4వ పిల్లల సంబరాల్లో మేజిక్ షో ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు.

జాతీయస్థాయి క్రీడల్లో నాగిరెడ్డిగూడెం విద్యార్థుల సత్తా

చింతలపూడి: జాతీయస్థాయి క్రీడల్లో ఎపిఆర్ఎస్ నాగిరెడ్డిగూడెం విద్యార్థినులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మండలి బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల నాగిరెడ్డిగూడెంలో పదవ తరగతి చదువుతున్న జి.అక్షయ, కె.కీర్తి, ప్రగడవరం గ్రామానికి చెందిన విద్యార్థినులు వేరు వేరు క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కె.కీర్తి ఈనెల 13న గుంటూరు జిల్లా బాపట్లలో జరిగిన సాఫ్ట్‌బాల్ క్రీడలో అండర్- 19 విభాగంలో, జి.అక్షయ ఈనెల 23న కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన రగ్బీ క్రీడ అండర్- 19 విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థినులు ఇద్దరు క్రీడల్లోనే కాకుండా చదువులో కూడా అత్యంత శ్రద్ధ వహించి రాణిస్తున్నందున వారిని పిఇటి.భూక్యా బాల భారతి, పాఠశాల సిబ్బంది మనస్ఫూర్తిగా అభినందించారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

భీమడోలు: కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.పద్మావతి దేవి కోరారు. మండలంలోని దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలో తొలిసారిగా ఎల్ఇడి స్క్రీన్‌తో యాత్ర ప్రచార రథం పర్యటించింది. పథకాల గురించి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No.66/2018, O.S.No.127/2016

Between:
Karumanchi Ravi Kumar (Died) ...D.H.R
Mulagaleti Subhadra and another
AND
Navanasi Venkata Appa Rao, S/o. Surya Rao, Badeti Vari Street, Eluru. ...J.D.R

వేలం ప్రకటన

పై నెంబరు గల ఇ.పి. గ్రంధములో ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖల ప్రోపర్టీని శ్రీ కోర్టు వారు **ది.20-12-2023వ తేదీ ఉ॥ 10:30 ని॥ల నుండి వేలం వేయబడును.** కావున ఆసక్తి కలవారు అనగా వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు ఒరిజినల్ మరియు జిరాక్సు, 1/4 వంతు అమౌంటుతో పై తెలిపిన కోర్టు ఎదుట హాజరు కావలెను.

SCHEDULE

323-4-0 Square Yards Equal to 268 Squar Meters in which Residential House is existed on the worth out of AC 4-08 Cts covered by R.S.No. 59/11 of Tangellamudi (V), Tangellamudi Panchayathi, Eluru (M), Eluru District, Eluru Sub Registrar within the following boundaries:

EAST: 24 Feet width road 42-0.
SOUTH: Site of Polegani Gopala Krishna 67-0.
WEST: Site of Kadiyala Chandrayya Etc., 44-9.
NORTH: Site of Bellemkonda Venkateswara Rao 67-0.

D.H.R. Value : Rs.3,21,000-00
Amina Value : Rs.40,30,000-00

ఏలూరు, 24-11-2023. నెక్కరగంటి నరసింహారావు, అడ్వకేట్, ఏలూరు.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

నేను, దాకమారి దానయ్య, తండ్రి: దాకమారి మంగారావు, రామాలయం వీధి, కావలిపురం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర. అను నా పేరున ఉన్న పాస్‌పోర్టు నెం. **V4837380** రు గలది ఒరిజినల్ జిరాక్స్ తీయించుటకు షాపునకు వెళుతుండగా పోయినది. దొరికినవారు పై అడ్రస్‌లోని **సెల్: 80082 45424** కు తెలియజేయగలరు.

దాకమారి దానయ్య
తండ్రి: దాకమారి మంగారావు
రామాలయం వీధి, కావలిపురం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా

In the Court of the Prl. Senior Civil Judge, Eluru
E.P. No. 5/2022, O.S. No. 239/12

Between:
Cheekati Krishna Rao and Another ...DHR
AND
Cheekati Venkata Rao and Others ...JDRs

JDR-5: Kasana Suryanarayana, S/o. Rama Rao, Hindu, Male, aged 41 years, Cultivation, D.No. 2-15.
JDR-6: Chintalapudi Venkata Naga Suryanarayana Murthy, S/o. Kedareswara Rao, Hindu, Male, aged 50 years, Cultivation, D.No. 2-17, aboveparties, Ankalapadu (V), K.Kota (M), W.G.District, ChJCJC.

కోర్టు ప్రకటన

పై నెంబరు గల E.P. లో JDRS 5 & 6 లకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు JDRS5 & 6 లకు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయిన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది. 15-12-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, Advocate, Eluru
Dt.20-11-2023, Cell: 9848118984

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No.66/2018, O.S.No.127/2016

Between:
Karumanchi Ravi Kumar (Died) ...D.H.R
Mulagaleti Subhadra and another
AND
Navanasi Venkata Appa Rao, S/o. Surya Rao, Badeti Vari Street, Eluru. ...J.D.R

వేలం ప్రకటన

పై నెంబరు గల ఇ.పి. గ్రంధములో ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖల ప్రోపర్టీని శ్రీ కోర్టు వారు **ది.20-12-2023వ తేదీ ఉ॥ 10:30 ని॥ల నుండి వేలం వేయబడును.** కావున ఆసక్తి కలవారు అనగా వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు ఒరిజినల్ మరియు జిరాక్సు, 1/4 వంతు అమౌంటుతో పై తెలిపిన కోర్టు ఎదుట హాజరు కావలెను.

SCHEDULE

323-4-0 Square Yards Equal to 268 Squar Meters in which Residential House is existed on the worth out of AC 4-08 Cts covered by R.S.No. 59/11 of Tangellamudi (V), Tangellamudi Panchayathi, Eluru (M), Eluru District, Eluru Sub Registrar within the following boundaries:

EAST: 24 Feet width road 42-0.
SOUTH: Site of Polegani Gopala Krishna 67-0.
WEST: Site of Kadiyala Chandrayya Etc., 44-9.
NORTH: Site of Bellemkonda Venkateswara Rao 67-0.

D.H.R. Value : Rs.3,21,000-00
Amina Value : Rs.40,30,000-00

ఏలూరు, 24-11-2023. నెక్కరగంటి నరసింహారావు, అడ్వకేట్, ఏలూరు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. No. 283/2021

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజార్ బ్రాంచ్, కొవ్వూరు, రిప్రజెంటెండ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్. -వాది
AND
పార్వతి రెడీమేడ్స్ మరియు క్లాత్ స్టోర్స్, ప॥గో॥జిల్లా. -ప్రతివాదులు

To:
శ్రీమతి ఉప్ప కనకదుర్గ దేవి, W/o. చంద్రరావు, డో.నెం. 3-35, కొత్తూరు, పోలవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. -ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 30-11-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి, 25-11-2023. **ఎం.వి.ఎస్.రామారావు**, అడ్వకేట్, కొవ్వూరు

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
ఇ.పి. నెం. 18/2022
ఒ.యస్. నెం. 45/2019

Between:
కారంగుల శివరామప్రసాద్ -పిటీషనరు/ డిక్రీ హోల్డర్
మరియు
మొక్కరాల శ్రీలత, మరియొకరు -రెస్పాండెంట్స్/జేడిఆర్స్

పిటీషనరు/ డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల ఇ.పి. వాంటు గ్రంధములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 20-12-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** వేలం వేయుదురు. ఆసక్తి ఉన్నవారు సదు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, ఏలూరు సబ్ రిజిస్ట్రీ యిలాక జానంపేట గ్రామపంచాయతి, జానంపేట గ్రామం దాఖలా రి.స. నెం. 393/1 దాఖలా 314 చ॥గజాలు స్థలం అందలి ఆర్‌సిసి బిల్డింగ్‌నకు హద్దులు.
తూర్పు: 2 గజముల వెడల్పు గల జాయింటు దారి.
దక్షిణం: కొటిక నాగరాజు గారి స్థలం.
పడమర: ఆత్కూరి వెంకటరత్నం గారి స్థలం.
ఉత్తరం: జగన్నాధపురం గ్రామం రోడ్డు.
డిక్రీ హోల్డరు విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ: రూ. 26,00,000/-

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, ది.29-11-2023. అడ్వకేట్సు, శ్రీరామ నివాస్, అశోక్‌నగర్, ఏలూరు